సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం। 4। జూన్। 2024



చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు, కనిష్టం రూ.15 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



వర్ణచిత్రం.. మనోరంజితం

పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న లేపాక్షిలో అలనాటి వర్ణచిత్రాలు సందర్శకుల మనసు దోచుకుంటున్నాయి.

8లో

గరిష్టం/కనిష్టం 33.2°/21.9°

జిల్లావ్యాప్తంగా సోమవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

నేడే కౌంటింగ్

సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం మంగళవారం తేలిపోనుంది. పోలింగ్ ముగిసిన క్షణం నుంచి వేసుకున్న లెక్కలు.. అంచనాలు..ఎగ్జిట్ పోల్ సర్వేల ఉత్కంఠకు నేడు తెరపడనుంది. ఎవరికి వారు తమదే విజయమని, మెజార్టీయే లక్ష్యమంటూ ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ... ప్రజలు ఎలాంటి తీర్పు ఇచ్చారోననే ఆందోళన వెంటాడుతోంది.

- ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- ఉదయం 8 నుంచి కౌంటింగ్ ప్రారంభం
- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- హిందూపురం, లేపాక్షి కేంద్రాల్లో భారీ బందోబస్తు
- ప్రక్రియ ముగిసేవరకూ అమలులో 144 సెక్షన్
- జిల్లా వ్యాప్తంగా పోలీసు ఆంక్షలు కఠినతరం
- విజయోత్సవ ర్యాలీలపై నిషేధం




లేపాక్షి సమీపంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ, కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసుల భద్రత

సాక్షి, పుట్టపర్తి

సార్వత్రిక సమరంలో విజేత ఎవరన్నది మరికొన్ని గంటల్లో తేలిపోనుంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ, హిందూపురం పార్లమెంట్ స్థానానికి మే 13వ తేదీన పోలింగ్ జరిగింది. అప్పటి నుంచి అభ్యర్థులు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు టెన్షన్‌తో గడుపుతున్నారు. బూత్ వారీ సర్వేలు, ఎగ్జిట్ పోల్స్‌తో ఇప్పటికే ఎవరికి వారు ఓ అంచనాకు వచ్చారు. ఓటు వేసిన ప్రజలు కూడా ఫలితం కోసం ఆత్రుతగా వేచి చూస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జరిగే కౌంటింగ్‌పైనే అందరూ దృష్టి సారించారు. ఫలితం ఎంత వేగంగా వస్తుందా? ఎప్పుడెప్పుడు తమ నాయకుడు గెలుస్తాడా? అని ఎదురు చూస్తున్నారు.

ఉత్కంఠకు నేటితో తెర..

ఫలితాలపై వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ధీమాగా ఉండగా.. ప్రతిపక్ష కూటమి అభ్యర్థుల్లో మాత్రం టెన్షన్ నెలకొన్నట్లు తెలుస్తోంది. గెలుస్తామో? లేదోనని కూటమి నేతలు ఆందోళన చెందుతున్నారు. కాగా చాలామంది జ్యోతిష్యులు, పండితుల బాట పట్టారు. తమ భవితవ్యం గురించి తెలుసుకునేందుకు ఆరాట పడ్డారు. అవి.. నిజమో... కాదో.. తేలాలంటే నేటి సాయంత్రం వరకు వేచి చూడాల్సిందే.

హిందూపురం పార్లమెంటు బరిలో ఉన్నవారు	13 మంది
జిల్లాలో అసెంబ్లీ స్థానాల సంఖ్య	7
అసెంబ్లీ బరిలో ఉన్న అభ్యర్థులు	91 మంది
పోలింగ్ కేంద్రాల సంఖ్య	1,852
పోలింగ్ సిబ్బంది సంఖ్య	879
పోలయిన ఓట్లు	14,03,259
పోస్టల్ బ్యాలెట్లు	20,091
కౌంటింగ్ సిబ్బంది	827
విధుల్లో ఉండే పోలీసుల సంఖ్య	881
కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు	147
టేబుళ్లు	98
రౌండ్లు	137

విహార యాత్రలు ముగించుకుని..

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం పలువురు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కుటుంబ సభ్యులతో కలిసి విహార యాత్రలకు వెళ్లారు. అంతకుముందు ఎన్నికల ప్రచారాల్లో బిజీగా గడిపిన ద్వితీయ శ్రేణి నేతలు కూడా సేదదీరేందుకు గోవా, ఊటీ తదితర ప్రాంతాలకు వెళ్లారు. ఇంకొందరు ఆలయాల బాట పట్టారు. అయితే కౌంటింగ్ తేదీ సమీపించడంతో ఒకరోజు ముందుగానే.. వారంతా స్వగ్రామాలకు చేరుకున్నారు. కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు కావడంతో హిందూపురంలోని హోటళ్లు, లాడ్జీలు, రెస్టారెంట్లన్నీ హౌస్‌ఫుల్ అయ్యాయి.

సర్వేలతో సతమతం..

ఆదివారమే వివిధ సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయడంతో చాలామంది టెన్షన్ పడుతున్నారు. ఎగ్జిట్ పోల్స్ తర్వాత కూడా రూ.కోట్లలో బెట్టింగ్ జరిగినట్లు తెలిసింది. బూత్ స్థాయి నుంచి అసెంబ్లీ, పార్లమెంటు, రాష్ట్ర స్థాయి వరకు మెజార్టీలపై బెట్టింగ్‌లు కాశారు. నేటితో ఎవరు విజేతో తెలిపోనుంది. కాగా ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు సొంతంగా సర్వేలు నిర్వహించి గెలుపుపై ధీమాగా ఉన్నారు. కౌంటింగ్‌కు కౌంట్ డౌన్ ప్రారంభం కావడంతో ఎవరి లెక్కల్లో వారు ఉన్నారు.

కౌంటింగ్ కేంద్రాలు : లేపాక్షి మండలం చోళ సముద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, హిందూపురంలోని బిట్స్ ఇంజినీరింగ్ కళాశాల, అనంతపురంలోని జేఎన్‌టీయూ

అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో: ధర్మవరం, పుట్టపర్తి అసెంబ్లీ స్థానాలు, 'పురం' పార్లమెంట్ స్థానం కౌంటింగ్

'బిట్స్' కళాశాలలో : మడకశిర, పెనుకొండ, హిందూపురం, కదిరి అసెంబ్లీ స్థానాలు, 'పురం' పార్లమెంట్ స్థానం కౌంటింగ్

జేఎన్‌టీయూలో: రాప్తాడు అసెంబ్లీ స్థానం, 'పురం' పార్లమెంట్ స్థానం ఓట్ల లెక్కింపు ఉంటుంది.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పోలయిన ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు
రాప్తాడు	281	2,13,207	14	21
మడకశిర	241	1,84,358	14	18
హిందూపురం	253	1,93,906	14	19
పెనుకొండ	265	2,05,192	14	19
పుట్టపర్తి	241	1,82,090	14	18
ధర్మవరం	290	2,18,292	14	21
కదిరి	281	2,06,214	14	21
మొత్తం	1,852	14,03,259	98	137

98 టేబుళ్లు.. 137 రౌండ్లు

జిల్లాలో హిందూపురం పార్లమెంట్ స్థానంలో పాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. హిందూపురం పార్లమెంట్ స్థానానికి 13 మంది, 7 అసెంబ్లీ స్థానాల్లో 91 మంది పోటీ పడ్డారు. జిల్లాలోని 14,03,259 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరో 20,091 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. ఓట్ల లెక్కింపునకు జిల్లాలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 879 మంది సిబ్బందిని నియమించారు. మొత్తంగా 137 రౌండ్లలో లెక్కింపు జరగనుండగా, 98 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్ వద్ద సూపర్ వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. అలాగే ఒక్కో అభ్యర్థికి సంబంధించి ఒక ఏజెంట్ ఉంటారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు..

కౌంటింగ్ సందర్భంగా అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే పోస్టులను, ఫొటోలు, వీడి యోలు షేర్ చేసినా, వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏదైనా గ్రూప్‌లో రాజకీయ వివాదానికి దారి తీసే పోస్టులు పెడితే సదరు గ్రూప్ అడ్మిన్లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు.

ముమ్మర ఏర్పాట్లు..

ఓట్ల లెక్కింపునకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. జిల్లా పరిధిలో రెండు కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. లేపాక్షి మండలం చోళసముద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, హిందూపురం మండలంలో 'బిట్స్' ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇప్పటికే అధికారులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్, ఆ తర్వాత ఉదయం 8.30 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు జరగనుంది. పుట్టపర్తి నియోజకవర్గానికి సంబంధించి ఫలితం మొదట వెలువడే అవకాశముంది. చిట్టచివరగా ధర్మవరం ఫలితం తేలనుంది. ఇక కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

భద్రత కట్టుదిట్టం..

కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. ఇద్దరు ఏఎస్పీలతో పాటు 881 మంది పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే కేంద్ర సాయుధ బలగాలు, గ్రేహౌండ్స్ బృందాలు కూడా కేంద్రాల వద్ద విధుల్లో ఉన్నాయి. సోమవారం నాటికే రెండు కౌంటింగ్ కేంద్రాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద నిరంతర నిఘా కోసం 147 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేసి అక్కడ నుంచి లెక్కింపు ప్రక్రియ పర్యవేక్షించేలా ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఎన్నికల ఫలితాలు ప్రతి రౌండ్‌కు ప్రజలకు తెలియజేసేలా ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కిలో మీటర్ దూరం వరకు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నారు.



అంబేడ్కర్ గురుకుల పాఠశాల వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



బిట్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన టేబుళ్లు



బిట్ కళాశాల వద్ద బారికేడ్లను పరిశీలిస్తున్న ఎస్పీ, జేసీ

లెక్కింపునకు సర్వం సిద్ధం

- 6వ తేదీ వరకూ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది
- 7 గంటల వరకే కేంద్రాల్లోకి అనుమతి
- కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన ఎస్పీ మాధవరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. కౌంటింగ్ కోసం 250 మంది మైక్రో అబ్జర్వర్లు, 603 మంది సూపర్ వైజర్లను నియమించామన్నారు. వారికే ఇప్పటికే రెండు విడతల శిక్షణ ఇచ్చామన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 2 వేల మంది పోలీసులతో భద్రతా చర్యలు చేపట్టామన్నారు. గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఉంటుందన్నారు. గొడవలు జరిగిన వెంటనే చేరుకునే విధంగా ప్రత్యేక బలగాలను సిద్ధంగా ఉంచామన్నారు. వాహనాలను పోలీసులు సూచించిన ప్రదేశాల్లో నిలపాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టులను అమలు చేస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

కలెక్టర్ ఇంకా ఏం చెప్పారంటే...

- మంగళవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుంది.
- 8.30 గంటలకు ఈవీఎంల లెక్కింపు ప్రారంభమవుతుంది.
- అభ్యర్థులు, ఏజెంట్లు గుర్తింపు కార్డు తప్పనిసరిగా ధరించాలి. ఉదయం 7 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఏజెంట్లను లోనికి అనుమతించబోం. అలాగే కౌంటింగ్ పూర్తయ్యే వరకూ బయటకు వెళ్లడానికి వీల్లేదు. వారికి కేటాయించిన టేబుల్ వద్దే ఉండాలి.
- ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత 5 వీవీ ప్యాట్ మిషన్ల స్లిప్పులను లెక్కిస్తాం. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం పరిశీలకులు ఉంటారు.
- ఈసీ అనుమతించిన సిబ్బందికి మినహాయించి కౌంటింగ్ హాల్‌లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదు. ఫారం 1–సీ కాపీ, పెన్సిల్, సాదా కాగితం , నోట్ ప్యాడ్ మాత్రం అనుమతిస్తాం.
- మీడియా పర్సన్‌కు సెల్‌ఫోన్‌కు అనుమతి ఉంటుంది. వారంతా మీడియా పాయింట్‌లోనే ఉండాలి.
- ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి 14 టేబుళ్లు పోస్టల్ బ్యాలెట్‌కు అదనంగా 2 టేబుళ్లు ఏర్పాటు చేశాం.
- ఫలితాలు వెల్లడైన తర్వాత ఈవీఎంలకు సీలింగ్ చేస్తాం. సాయంత్రం 3, 4 గంటలకు అన్ని ఫలితాలు వెల్లడిస్తాం.
- కౌంటింగ్ సమయంలో ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, నిబంధనలు ఉల్లంఘించినా బయటకు పంపే అధికారం ఆర్‌ఓలకు ఉంటుంది.

పాస్ ఉంటేనే కేంద్రంలోకి అనుమతి

- కౌంటింగ్ ప్రశాంతంగా సాగేందుకు చర్యలు తీసుకోవాలి
- ఎవరైనా సరే ఫలితాల వెల్లడి తర్వాతే బయటకు పంపాలి
- పోలీసులకు ఎస్పీ మాధవరెడ్డి దిశానిర్దేశం

హిందూపురం/హిందూపురం అర్బన్: జిల్లా ఎన్నికల అధికారి జారీ చేసిన పాస్ ఉంటేనే కౌంటింగ్ కేంద్రంలోనికి అనుమతించాలని, లేకపోతే నిర్మొహమాటంగా వెనక్కు పంపాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం ఆయన హిందూపురం సమీపంలోని 'బిట్స్' ఇంజినీరింగ్ కళాశాల, లేపాక్షి సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయా కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీసులకు దిశానిర్దేశం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రం లోపలికి ప్రవేశించే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి వారి వద్ద పాస్ ఉంటేనే పరిశీలించి లోపలికి పంపించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోనికి వెళ్లిన వారిని ఫలితాలు వెల్లడయ్యే వరకు బయటకు పంపవద్దన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించకూడదన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తావివ్వకుండా పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడకుండా చూడాలని ఆదేశించారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత కూడా విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించడానికి అనుమతులు లేవన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ విష్ణు, డీఎస్పీ కంజాక్షన్, ఇతర పోలీస్ అధికారులు ఉన్నారు.



బిట్ ఇంజనీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

న్యూస్‌రీల్

వీరభద్రుని సేవలో గోవా మంత్రి విశ్వజిత్‌రాణే



మంత్రి విశ్వజిత్‌రాణేకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ ఈఓ

లేపాక్షి: గోవా ఆరోగ్య, పట్టణాభివృద్ధి, ఆటవీ, స్త్రీ శిశుశాఖ మంత్రి విశ్వజిత్‌రాణే సోమవారం లేపాక్షి వీరభద్రుని సేవలో గడిపారు. సోమవారం ఉదయం లేపాక్షికి విచ్చేసిన ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశ్వజిత్ రాణే ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం దుర్గాదేవి, వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వజిత్ రాణేకు దేవదాయ శాఖ అధికారులు పూలమాల వేసి, శాలువాతో సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దుర్గాదేవి మొక్కు చెల్లించుకునేందుకు లేపాక్షికి విచ్చేశానని తెలిపారు. విజయనగర రాజుల కాలంనాటి శిల్పాలు, చిత్రలేఖనాలు ఇప్పటికి చెక్కుచెదరకుండా ఉండటం ఆప్పటి శిల్పుల గొప్పతనానికి నిదర్శనమన్నారు. లేపాక్షి తననెంతో ఆకట్టుకుందని సందర్శన పుస్తకంలో తన అభిప్రాయాన్ని నమోదు చేశారు.

సబ్సిడీ విత్తనం దుర్వినియోగం చేస్తే చర్యలు



గువ్వలగొందిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న డీఏఓ సుబ్బారావు, ఏడీఏ కృష్ణయ్య

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన విత్తనాన్ని దుర్వినియోగం చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు హెచ్చరించారు. విత్తనం తీసుకున్న రైతులంతా పంట సాగు చేయాలని సూచించారు. సోమవారం ఆయన మండల పరిధిలోని ముష్టికోవెల, గువ్వలగొందిపల్లి గ్రామాల్లో జరుగుతున్న విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ముందుగా ముష్టికోవెల గ్రామ పంచాయతీలోని రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీకి సంబంధించిన వివరాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి రైతుకూ సబ్సిడీ విత్తన వేరుశనగ అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గువ్వలగొందిపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి అయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సబ్సిడీ విత్తనం దుర్వినియోగం చేసినట్లు తెలిస్తే పంట నమోదు చేయబోమని, దీనివల్ల ప్రభుత్వ రాయితీకి అర్హత కోల్పోతారన్నారు. ఆయన వెంట ఏడీఏ కృష్ణయ్య, చెన్నేకొత్తపల్లి వ్యవసాయాధికారి ఉదయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

25 మంది జిల్లా బహిష్కరణ

- నెల రోజుల గడువు విధిస్తూ ఆదేశాలు
- బహిష్కృతుల్లో చాలామంది వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, పుట్టపర్తి సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పలువురిపై పోలీసు శాఖ జిల్లా బహిష్కరణ వేటు వేసింది. మొత్తం 25 మందిని నెల రోజుల పాటు జిల్లా బహిష్కరణ చేస్తూ జిల్లా పోలీసు కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఎక్కువ మంది వైఎస్సార్‌సీపీ కీలక నాయకులు, మద్దతుదారులు ఉండటం విశేషం. యాంటీ సోషియల్ అండ్ అజార్డస్ యాక్టివిటీస్ యాక్ట్ -1980 ప్రకారం చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా బహిష్కరణ జాబితాలో రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం నసనకోటకు చెందిన కురుబ ముత్యాలప్ప పేరు కూడా ఉంది.



రొళ్ల మండలం శివబాలయోగినగరం సమీపంలోని చెక్‌డ్యాంలోకి చేరిన వర్షపునీరు

18 మండలాల్లో వర్షం

పుట్టపర్తి అర్బన్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ జిల్లాలోని 18 మండలాల్లో వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా కనగానపల్లి మండలంలో 43.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే బత్తలపల్లి 29.2 మి.మీ, తాడిమర్రి 28.4 మి.మీ, గుడిబండ 23.2 మి.మీ, రొళ్ల 22.2 మి.మీ, ఎన్పీ కుంట 19.2 మి.మీ, కదిరి 18.2 మి.మీ, ధర్మవరం 12.4 మి.మీ, తనకల్లు మండలంలో 10.4 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. మిగతా 10 మండలాల్లో 10 -1.2 మి.మీ మధ్య వర్షపాతం నమోదైంది. తాజా వర్షాలతో ఖరీఫ్ సాగు ఊపందుకోనుంది. ఇప్పటికే ప్రభుత్వం సబ్సిడీపై విత్తన వేరుశనగ అందించగా, రైతులంతా ఉత్సాహంగా సాగుకు సిద్ధమవుతున్నారు.

జిల్లాకు వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: రాగల మూడు రోజులు ఉమ్మడి జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు సోమవారం బులెటిన్ విడుదల చేశారు. అక్కడక్కడా 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు, ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ వర్షం, ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసే సూచనలు ఉన్నట్లు పేర్కొన్నారు. నైరుతి రుతుపవనాల విస్తరణకు అనుకూల వాతావరణం, నైరుతి బంగాళాఖాతంలో దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు తీరాలకు అనుకుని సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు వివరించారు.



ధర్మవరంలో కురుస్తున్న వర్షం

క్లుప్తంగా

కూలిన ప్రహరీ ... యువకుడి మృతి

- ఎద్దుకూ గాయాలు


అఖిల్(ఫైల్)

ఆత్మకూరు: ప్రహరీ కుప్ప కూలడంతో శిథిలాల కింద చిక్కుకుని ఓ యువకుడు మృతి చెందాడు. ఓ ఎద్దు కూడా గాయపడింది. వివరాలు... ఆత్మకూరుకు చెందిన అంకె ఆంజనేయులు, ప్రమీల దంపతుల కుమారుడు అఖిల్ (18) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఈ క్రమంలో తమకున్న రెండు ఎద్దుల్లో ఒకదానిని సోమవారం ఉదయం ఇంటి వద్దనే నీటితో శుభ్రం చేస్తుండగా పక్కనే ఉన్న ప్రహరీలో కొంత భాగం కూలింది. దీంతో ఎద్దుకు కట్టిన తాడును తప్పిస్తుండగా మిగిలిన ప్రహరీ సైతం కుప్పకూలింది. శిథిలాల కింద అఖిల్ చిక్కుకున్నాడు. గోడ కూలిన శబ్దానికి అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు వెంటనే సహాయక చర్యలు చేపట్టి శిథిలాల కింద చిక్కుకున్న అఖిల్ వెలికి తీశారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందాడు. ఎద్దు కాలికి బలమైన గాయం కావడంతో నడవలేక అక్కడే చతికిలబడింది. ఒక్కగానొక్క కొడుకు కళ్ల ముందే రక్తపు గాయాలతో విగతజీవిగా పడి ఉండడం చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు.

రిజర్వాయర్ గేట్ల పరిశీలన


రెగ్యులేటరీ గేట్లు పరిశీలిస్తున్న ఎస్‌ఈ దేశేనాయక్, తదితరులు

కదిరి అర్బన్: చెర్లోపల్లి రిజర్వాయర్‌ను సోమవారం హంద్రీ–నీవా ఎస్‌ఈ దేశేనాయక్ పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభమైనందున రిజర్వాయర్‌లోని రెగ్యులేటరీ గేట్ల పనితీరును తనిఖీ చేశారు. నీటి నిర్వహణకు ఆటంకం లేకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు డీఈ విశ్వనాథ్‌నాయక్ తెలిపారు. ఎస్‌ఈ వెంట ఏఈలు పాండురంగ, హథీరామ్‌నాయక్ ఉన్నారు.

కలుషిత ఆహారం తిని అస్వస్థత

ముదిగుబ్బ: మండలంలోని మంగళమడక గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు లోనయ్యారు. ఆదివారం రాత్రి తమ ఇంట్లో వండిన ఆహారాన్ని తిన్న పద్మావతి, రామచంద్రమ్మ, జయరాజు, నిఖిల్... సోమవారం తెల్లవారుజాము నుంచి వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా వారిని ముదిగుబ్బలోని పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

ఓటింగ్ ముగిసింది.. తో(టో)ల్ తీస్తున్నారు

- దేశవ్యాప్తంగా ఓటింగ్ ప్రక్రియ ముగియగానే టోల్ ధరల పెంపు
- ఆదివారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి
- సగటున 5 శాతం పెంచినట్లు ప్రకటించిన ఎన్‌హెచ్ఏఐ
- కేంద్రం తీరుపై వాహనదారుల విమర్శలు



రాప్తాడు మండలం మరూరు వద్ద ఏర్పాటు చేసిన టోల్ ప్లాజా

హిందూపురం అర్బన్: టోల్ చార్జీలు వాహనదారులకు మరింత భారమయ్యాయి. ప్రస్తుతమున్న చార్జీలకు సగటున 5 శాతం పెంచినట్లు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ప్రకటించింది. పెంచిన చార్జీలు ఆదివారం అర్ధరాత్రి నుంచే అమలులోకి తీసుకువచ్చింది.

ఎన్నికల నేపథ్యంలో ఆలస్యంగా...

వాస్తవానికి ఏటా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్త టోల్ రేట్లను అమలులోకి తెస్తారు. కానీ ఈసారి లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. టోల్ ధరలను పెంచకుండా కేంద్రంలోని మోదీ సర్కార్ తొక్కిపెట్టింది. ఈ క్రమంలో ఈ నెల 1న దేశవ్యాప్తంగా ఓటింగ్ ప్రక్రియ ముగిసింది. దీంతో 2వ తేదీన టోల్ చార్జీలను పెంచుతూ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థ పెంచిన ధరలకు అనుగుణంగా టోల్ కాంట్రాక్ట్ దక్కించుకున్న నిర్వాహకులు ఐదు శాతం మేర టోల్ చార్జీలు పెంచి ఆదివారం అర్ధరాత్రి నుంచి వసూలు చేయడం మొదలు పెట్టారు. ఈ లెక్కన కనిష్టం రూ.5 నుంచి గరిష్టంగా రూ.40 వరకూ చార్జీలు పెరిగాయి. కార్లు, ట్రక్కులు, బస్సులు, భారీ వాహనాలు, ఇతర వాణిజ్య వాహనాలపై వాటి ఇంజన్ సామర్థ్యాన్ని బట్టి ధర నిర్ణయించారు.

మరూరు టోల్‌ప్లాజాలో చార్జీలు ఇలా....

వాహనం	సింగిల్		రానుపోను	
	పాత చార్జీ	కొత్త చార్జీ	పాత చార్జీ	కొత్త చార్జీ
కారు, జీపు, వ్యాన్, ఎల్ఎంవీ	రూ.135	రూ.140	రూ.205	రూ.210
లైట్, గూడ్స్, మినీగూడ్స్	రూ.220	రూ.225	రూ.330	రూ.335
బస్సు, ట్రక్కు	రూ.460	రూ.470	రూ.690	రూ.705
త్రీ యాక్సిల్ వాణిజ్య వాహనం	రూ.500	రూ.515	రూ.750	రూ.770
4-6 యాక్సిల్ వాహనాలు	రూ.720	రూ.740	రూ.1,080	రూ.1,105
భారీ వాహనం	రూ.875	రూ.900	రూ.1,315	రూ.1,350

ఉమ్మడి జిల్లా వాసులపై రూ.60 లక్షల అదనపు భారం..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 8 టోల్ ప్లాజాలు ఉండగా, రోజూ 13 వేల నుంచి 14 వేల వరకూ వాహనాలు ఆయా టోల్‌ప్లాజాల మీదుగా సంచరిస్తున్నాయి. టోల్ సుంకం ద్వారా నెలకు రూ.15కోట్ల మేర రాబడి కేంద్రానికి వెళుతోంది. ఉమ్మడి జిల్లాలోని 44వ జాతీయ రహదారిపై రాప్తాడు మండలం మరూరు, పెద్దవడుగూరు మండలం కాసేపల్లి (గుత్తి సమీపంలో) టోల్‌ప్లాజాలు ఉన్నాయి. వీటి ద్వారా పెంచిన యూజర్ ఛార్జీలు లెక్కించుకుంటే నెలకు రూ.60 లక్షలు చొప్పున జిల్లా వాసులపై అదనపు భారం పడుతోంది. మరూరు టోల్ ప్లాజా వద్ద కారు, జీపు, లైట్ మోటార్ వాహనాలకు గతంలో ఒక వైపు రూ.135 వసూలు చేసేవారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి రూ.140 వసూలు చేస్తున్నారు. రానుపోనుకైతే వసూలు చేస్తున్న రూ.200ను రూ.210కు పెంచారు. మిగిలిన వాహనాల సామర్థ్యాన్ని బట్టి రూ.10 నుంచి రూ.40 వరకు చార్జీల భారం పెరిగింది.

కాసేపల్లి టోల్ ప్లాజా వద్ద పెరిగిన ధరలు ఇలా..

కారు, జీపు, ఎల్ఎంవీ వాహనాలకు ఒక వైపు రూ.125 రెండు వైపులా రూ.190 కాగా, లైట్ కమర్షియల్, గూడ్స్ వాహనాలకు ఒకవైపు రూ. 205, ఇరువైపుల రూ. 305, బస్సు, ట్రక్కులకు సింగల్ రూ.425, ఇరువైపులా రూ.640, త్రీ యాక్సిల్ కమర్షియల్ వాహనాలకు సింగల్ రూ.465 , ఇరువైపులా రూ.700, 4–6 యాక్సిల్ వాహనాలకు ఒక వైపు రూ.670, ఇరువైపులా రూ.1,005, భారీ వాహనాలకు ఒకవైపు రూ.815, ఇరువైపులా రూ.1,220 చొప్పున వసూలు చేస్తున్నారు.


వర్ణ చిత్రం... మనో రంజితం


వటపత్రంపై చిన్నికృష్ణుడు


మత్స్యయంత్రాన్ని ఛేదిస్తున్న అర్జునుడు


పార్వతీదేవిని అలంకరించేందుకు వచ్చిన పరివారము


వీరభద్రస్వామికి నమస్కరిస్తున్న ఆలయ నిర్మాత విరుపణ్ణ పరివారము


మనునీతి చోళుని ఇతివృత్తం తెలిపే చిత్రం

లేపాక్షి: అపురూప చిత్రాలు, శిల్పాలు చూసిన రసజ్ఞుడైన పర్యాటకుడి మనసు స్పందన నుంచి వచ్చిన మాటే... అద్భుతం. ఇంతటి అద్భుతానికి వేదికైంది ప్రపంచ వారసత్వ సంపదగా ఖ్యాతిగాంచిన లేపాక్షిలోని దుర్గావీరభద్రస్వామి ఆలయం. చిత్రకారుని కుంచె నుంచి జాలువారిన వర్ణ చిత్రం.... శిల్పకారుడి ఉలి నుంచి ఉద్భవించిన అపురూప శిల్పం... వెరసి శిల్ప, చిత్రకళల కాణాచిగా లేపాక్షి విరాజిల్లుతోంది.

సొగసైన చిత్రాలు..

లేపాక్షి ఆలయం శిల్పాలకే కాదు... వర్ణ చిత్రాలకూ ప్రసిద్ధి చెందింది. ఆలయంలోని నాట్యమంటపం పైకప్పులో వర్ణరంజితమైన చిత్రాలు నేటికీ చెక్కు చెదరలేదు. రామాయణ, మహాభారత ఇతిహాసాలను సొగసుగా చిత్రీకరించారు. పుత్రకామేష్టి యాగ విధానాన్ని వివరిస్తున్న వశిష్టుడు, సీతా స్వయంవరం, సీతాపహరణ, రామ–రావణ యుద్ధం, శ్రీరామ పట్టాభిషేకం, అర్జునుడి మత్స్యయంత్ర ఛేదనం, కిరాతార్జునీయ ఘట్టాలు, బ్రహ్మ, విష్ణు, నంది, భృంగి సమేతంగా శివుడు ప్రత్యక్షమవడం, వృషభ వాహనంపై శివపార్వతులు తదితర చిత్రాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పార్వతీకి అలంకారం చేస్తున్న ఏడుగురు చెలికెత్తలు, వివిధ కేశాలంకరణలు కలిగిన స్త్రీలు, గిరిజా కల్యాణంలో వధువు తలమీద పోస్తున్న తలంబ్రాల చిత్రాలు సహజత్వం ఉట్టిపడేలా ఉన్నాయి. వటపత్రంపై పవళించిన చిన్నికృష్ణుడు తన కాలి బొటన వేలిని నోటిలో ఉంచుకుని మనం ఎటువైపు తిరిగి చూసినా మనవైపే చూస్తున్నట్టుగా చిత్రీకరించి చిత్రకారుడి నైపుణ్యాన్ని ప్రతి ఒక్కరూ కొనియాడుతుంటారు.

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

పుట్టపర్తి అర్బన్: కౌంటింగ్ కేంద్రాలను ఆయా నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు సోమవారం పరిశీలించారు. లేపాక్షిలోని గురుకుల పాఠశాల కౌంటింగ్ కేంద్రాన్ని పుట్టపర్తి ఆర్‌ఓలు భాగ్యరేఖ, ధర్మవరం ఆర్‌ఓ వెంకట శివరామిరెడ్డి, హిందూపురం వద్ద ఉన్న బిట్ కళాశాలలోని కౌంద్రాన్ని హిందూపురం ఆర్‌ఓ, జేసీ అభిషేక్ కుమార్, పెనుకొండ ఆర్‌ఓ/సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, మడకశిర ఆర్‌ఓ గౌరీశంకర్, కదిరి ఆర్‌ఓ సన్నీ వంశీకృష్ణ తదితరులు పరిశీలించారు. నియోజక వర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేయగా ఒక్కో టేబుల్‌కు కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్‌తో పాటు ఓ కౌంటింగ్ ఏజెంట్ ఉంటారని, వీరితో పాటు ఈసీ పరిశీలకుడు ఉంటారని అధికారులు తెలిపారు.

దారులన్నీ 'పురం'వైపే

- కౌంటింగ్ నేపథ్యంలో భారీగా తరలివచ్చిన జనం
- నిండిపోయిన లాడ్జీలు
- కల్యాణమంటపాల్లోనూ బస

హిందూపురం టౌన్: అందరూ ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ రానే వచ్చింది. మంగళవారం ఉదయం హిందూపురం మండల పరిధిలోని బిట్ కళాశాలతో పాటు లేపాక్షి సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కౌంటింగ్ ప్రక్రియను అధికారులు చేపట్టనున్నారు. దీంతో ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో తెలుసుకునేందుకు పెద్ద సంఖ్యలో జిల్లా వాసులు సోమవారం సాయంత్రానికే హిందూపురానికి చేరుకున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని మొత్తం లాడ్జీలన్నీ కిటకిటలాడుతున్నాయి. వారం రోజుల క్రితమే గదులు బుక్ చేయడంతో కొత్త వారికి అవకాశం లేకుండా పోయింది. రూమ్‌లు దొరక్కపోవడంతో చివరకు కల్యాణమంటపాల్లో బస చేయడానికి సిద్ధమయ్యారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రాజకీయ నాయకులు హిందూపురంలో తమకు తెలిసిన వారి ఇళ్లకు చేరుకున్నారు.

కరెంట్ షాక్‌తో గొర్రెల మృతి


మృతి చెందిన గొర్రెలు

తనకల్లు: స్థానిక ఇందిరానగర్ నివాసముంటున్న కాపరి మౌలాబీకి చెందిన ఎనిమది గొర్రెలు సోమవారం కరెంట్ షాక్‌తో మృతి చెందాయి. తన అల్లుడు హైదర్‌వలీతో ఆయన కలసి గొర్రెల పోషణ చేపట్టాడు. గొర్రెల మంద కోసం ఇంటి వద్దనే ఓ రేకుల షెడ్ ఏర్పాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పెనుగాలులకు రేకుల షెడ్‌పై ఉన్న సర్వీస్ వైరు తెగి పడింది. దీంతో విద్యుత్ ప్రసారం జరిగి షెడ్ లోపల ఉన్న గొర్రెలు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాయి. గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన గొర్రెల విలువ రూ.లక్ష ఉంటుందని గొర్రెల కాపరి వాపోయాడు.

అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరిగి మండలంలోని సేవామందిరం ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు అర్హులైన దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ఆ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ అడ్మిషన్లు కల్పించనున్నారు. మొత్తం 150 సీట్లకు గాను ఇప్పటి వరకూ వివిధ తరగతుల్లో 52 మంది విద్యార్థులు ఉన్నారు. మిగిలిన 98 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. ఆయా తరగతుల కోసం ప్రవేశం కోరే విద్యార్థులు 5 నుంచి 14 సంవత్సరాల వయసు ఉండాలి. సదరన్ క్యాంప్ ద్వారా పొందిన 40 శాతం అంధత్వ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. వీటితో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 80088 89815, 81434 61585, 80081 71524, 94900 10115, 94992 71392, 94907 37661లో సంప్రదించవచ్చు.

ఆర్డీటీ సెట్‌లో సత్తా చాటిన 'గురుకుల' విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకులాల్లో చదివిన విద్యార్థులు ఆర్డీటీ సెట్‌లో సత్తా చాటారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉన్నత విద్య అభ్యసించాలనుకునే నిరుపేద విద్యార్థులకు ఇటీవల ఎంపిక పరీక్షను ఆర్డీటీ నిర్వహించి, ఫలితాలను వెల్లడించింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ గురుకుల పాఠశాలల్లో చదివి పదో తరగతి ఉత్తీర్ణులైన 26 మంది విద్యార్థులు ప్రతిభ చాటి ఎంపికయ్యారు. వీరికి ఆర్డీటీ నిధులు సమకూర్చి ఐఐటీ/నీట్ కోచింగ్‌తో కూడిన ఇంటర్ విద్యను వారు కోరుకున్న కార్పొరేట్ కళాశాలల ద్వారా అందజేయనుంది. ఈ మేరకు గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ అంగడి మురళీకృష్ణ సోమవారం తెలిపారు. ఎంపికైన వారిలో కురుగుంట గురుకుల పాఠశాల నుంచి 12 మంది, గుత్తి సమీపంలోని రజాపురం పాఠశాల నుంచి ఐదుగురు, హిందూపురంలోని గురుకులం నుంచి ఒకరు, కణేకల్లు గురుకులంలో ఇద్దరు, మలుగూరు నుంచి ఇద్దరు, నల్లమాడ నుంచి ఇద్దరు, రొళ్ల నుంచి ఇద్దరు విద్యార్థులున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

లేపాక్షి: చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి గ్రామానికి చెందిన అరవ రవికుమార్ (32) ఈ నెల 1న మద్యం సేవించి స్థానిక పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులో దిగిన ఆయన లోతట్టు ప్రాంతానికి వెళ్లి నీట మునిగి ఊపిరాడక మృతి చెందాడు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన వారు నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీసి, పంచనామా నిర్వహించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ షర్ఫుద్దీన్ తెలిపారు.

వైభవం.. పాండురంగడి రథోత్సవం


ప్రత్యేక అలంకరణలో రుక్మిణీపాండురంగస్వామి మూలవిరాట్

బొమ్మనహాళ్: ఆంధ్ర పండరీపురంగా ప్రసిద్ధి చెందిన బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లులో వెలసిన రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవం సోమవారం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం 6 గంటలకు ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అఖండ దీపం వెలిగించి, స్వస్తి పుణ్యాహవాచనం, వాస్తు మంటపారాధన, మహాగణపతి, నవగ్రహ, వాస్తు, లక్ష్మీనారాయణ హోమాలు జరిగాయి. పూర్ణాహుతి అనంతరం సాయంత్రం 5.30 గంటలకు మహారాష్ట్రలోని పండరీపురం నుంచి విచ్చేసిన పీఠాధిపతి గోపాల్ మహారాజ్ ఆధ్వర్యంలో రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఆంధ్ర, కర్ణాటక , మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఉంతకల్లు జనసంద్రమైంది. రథోత్సవం ముందు వార్కరీ సంప్రదాయాన్ని అనుసరిస్తూ నిర్వహించిన పండరీ భజన ఆకట్టుకుంది. సాయంత్రం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

టీడీపీ నేతలపై పోలీసుల మెతక వైఖరి

- మద్యంతో పట్టుబడినా చర్యలు శూన్యం

పుట్టపర్తి: ఎన్నికల నేపథ్యంలో సామాన్య వ్యక్తుల వద్ద మద్యం పట్టుబడితే నానా హంగామా చేసే పోలీసులు... టీడీపీ నేతల పట్ల స్వామి భక్తిని చాటుకోవడం చర్చనీయాంశమైంది. గత నెలలో 100 బాక్సుల్లో కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తూ పుట్టపర్తిలో టీడీపీ నేతలు పట్టుబడ్డారు. ఈ క్రమంలో వారిపై నేటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కేసు నుంచి వారిని తప్పించేందుకు పోలీసులు భారీగా ముడుపులు దండుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. తాజాగా బుక్కపట్నం మండలం లింగప్పగారిపల్లిలో టీడీపీ నేత చంద్రశేఖర్ నుంచి సోమవారం 7 బాక్సుల అక్రమ మద్యాన్ని ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది స్వాధీనం చేసున్నారు. ఈ కేసులో నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు వెల్లడించారు. అయితే దీనిపై కూడా పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పెన్నహోబిలంలో హుండీ కానుకల లెక్కింపు

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ముగిసిన నేపథ్యంలో ఆలయంలోని ఆరు హుండీల్లోని భక్తుల కానుకల లెక్కింపు ప్రక్రియను సోమవారం చేపట్టారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి 17 రోజులకు గాను రూ.17,21,128 ఆదాయం సమకూరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా 17 రోజులకే ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరడం విశేషమని ఆలయ కార్య నిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్, బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి బి.అక్కిరెడ్డి అన్నారు.

వజ్రం.. దొరికితే సంబరం

తొలకరి వర్షాలు ప్రారంభం కాగానే పొలాల్లో విత్తు సందడి మొదలవుతుంది. అయితే వజ్రకరూరులో మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఏటా మే, జూన్ మాసాల్లో తొలకరి వర్షాలు ప్రారంభమైన వెంటనే ఇక్కడ పొలాల్లో వజ్రాల వేట మొదలవుతుంది. స్థానికులతో పాటు కర్నూలు, శ్రీసత్యసాయి, వైఎస్సార్ జిల్లా వాసులు, కర్ణాటక , తెలంగాణ ప్రాంతాలకు చెందిన వందలాది మంది తరలి వచ్చి పొలాల బాట పడతారు. పిల్లాపాపలతో కలసి వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకూ వజ్రాల వేట కొనసాగిస్తారు. కాస్త రంగు రాయి కనిపిస్తే వెంటనే దానిని భద్రంగా తీసుకెళ్లి వ్యాపారి వద్ద తమ అదృష్టానికి వెల కట్టించి, డబ్బు తీసుకుని సంబరంగా ఇంటికి వెళుతుంటారు. – వజ్రకరూరు:



పొలంలోనే భోజనం చేస్తున్న దృశ్యం


వజ్రాల కోసం అన్వేషిస్తున్న జనం